www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 8 జూన్ 2023
5
తిరుపతి

'వారాహి'యాత్రను విజయవంతం చేయి స్వామి : జనసేన

తిరుపతి సిటి : తమ నాయకుడు పవన్‌కల్యాణ్ చేపట్టనున్న వారాహి యాత్రను విజయవంతం చేయాలని జనసేన నాయకులు అలిపిరి గరుడ విగ్రహం వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కుకున్నారు. జనసేన నాయకులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, కిరణ్‌రాయల్, రాజారెడ్డి మాట్లాడుతూ ఈనెల 14న అన్నవరం నుంచి ఉభయగోదావరి జిల్లాల్లో యాత్ర సాగనుందని తెలిపారు. ధర్మానికి అధర్మానికి మధ్య జరుగుతున్న యుద్ధంలో పవన్‌కల్యాణ్ చేస్తున్న వారాహి యాత్ర విజయవంతం చేయాలన్నారు.

పన్నులు వసూలు చేస్తాం.. అప్పు ఇవ్వండి..!

ప్రపంచబ్యాంకుకు తిరుపతి కార్పొరేషన్ మొర
నగరాభివృద్ధికి ప్రపంచబ్యాంక్ 'ఫైనాన్స్'
అప్పు తీర్చే మార్గాలను వివరించిన కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి నగర పాలక సంస్థ అభివృద్ధికి ప్రపంచబ్యాంక్ ఫైనాన్స్ చేయనుంది. ఈ నేపథ్యంలో కార్పొరేషన్‌కు వచ్చే ఆదాయ వనరులు, అప్పు తీర్చే మార్గాలపై వరల్డ్ బ్యాంక్ ప్రతినిధి విజయశేఖర్‌తో నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి బుధవారం సమావేశమయ్యారు. నగర పాలక సంస్థలకు, మున్సిపాలిటీలకు ఆర్థిక వనరులు సమకూర్చుటకు అవసరమైన ఫైనాన్స్ అందించేందుకు ప్రపంచబ్యాంక్ చేయూతనిస్తుందని విజయ్‌భాస్కర్ తెలిపారు. చేపట్టబోయే ప్రాజెక్టుల విలువ, వాటి ఆవశ్యకత, వాటి ద్వారా నిధులు తిరిగి ఎలా వస్తాయి అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. తమ సంస్థతో చర్చించి నిధులు ఫైనాన్స్ ఇచ్చేందుకు ఓ నిర్ణయం తీసుకుంటామన్నారు. హరిత, భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ నగరంలో చేపట్టిన ప్రాజెక్టులు పూర్తయితే కార్పొరేషన్‌కు ఆదాయ వనరులు పెరుగుతాయన్నారు. మాస్టర్‌ప్లాన్ రోడ్లు రావడం వల్ల ఆయా ప్రాంతాల్లో ఇళ్లు, అపార్టుమెంట్లు, కార్యాలయాలు, షాపులు రావడం వల్ల పన్నుల రూపంలో నగర పాలక సంస్థకు ఆదాయం

ప్రపంచబ్యాంక్ ప్రతినిధులతో సమావేశం

సమకూరుతుందన్నారు. మల్టీ లెవల్ కారు పార్కింగ్, వేస్ట్ మేనేజిమెంట్ ద్వారా ఆదాయం సమకూరుతుందని తెలిపారు. రానున్న కాలంలో వరల్డ్‌బ్యాంక్ వారితో మరింతగా చర్చించి ప్రజా ప్రయోజన ప్రాజెక్టులకు అవసరమైన ఫైనాన్స్ స్థితిగతులపై చర్చిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

పంటలు ఎండిపోతున్నాయ్..!

అధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం
వాడివేడిగా మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- తొట్టంబేడు

'పవర్‌కట్ వల్ల పంటలు ఎండిపోతున్నాయి' అని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ, విద్యుత్ శాఖ అధికారులపై మండిపడ్డారు. తొట్టంబేడు మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా బుధవారం జరిగింది. అధికారుల తీరుపై పలువురు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా విద్యుత్, వ్యవసాయ, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారుల తీరుపై ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. తొట్టంబేడు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఉన్నం నిర్మల అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు స్థానిక సమస్యలపై అధికారులను నిలదీశారు. ముఖ్యంగా విద్యుత్ శాఖ అధికారుల తీరు ఎండగట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పోవడంతో పంటలు నిలువునా ఎండి పోతున్నాయని వారు మండిపడ్డారు. విద్యుత్ సరఫరా ఎపుడు ఉంటుందో... ఎపుడు ఆపివేస్తారో చెప్పలేని దుస్థితి ఏర్పడిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సమస్య వస్తే ఆ శాఖ అధికారులు సకాలంలో స్పందించడం లేదన్నారు. ఎల్‌సీలు తీసుకోవాలంటే గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందన్నారు. ట్రాన్స్ ఫార్మర్ల సమస్య వచ్చినా విద్యుత్ శాఖ వారు పట్టించుకోవడం లేదన్నారు. విద్యుత్ శాఖ అధికారుల తీరుపై ప్రతి సమావేశంలో చర్చిస్తున్నప్పటికీ వారు

మారడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండు చేశారు. ఇక వ్యవసాయశాఖ అధికారుల తీరుపై కూడా పలువురు ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం రాయితీపై రైతులకు సరఫరా చేసే వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు తమకు అనుకూలంగా ఉన్న వారికి అధికారులు కట్టబెట్టడం ఎంతవరకు న్యాయమని వారు ప్రశ్నించారు. రాయితీ పనిముట్ల పంపిణీలో పారదర్శకత పూర్తిగా లోపించిందన్నారు. రూ.కోటికి విలువ చేసే వ్యవసాయ పనిముట్లు ఎవరికి ఇచ్చారో తెలియచేయాలని పలువురు ప్రజా ప్రతినిధులు నిలదీశారు. ఇక రైతులకు రాయితీపై ఎరువులు, విత్తనాలు కూడా సక్రమంగా పంపిణీ చేయడం లేదన్నారు. వ్యవసాయశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండు చేశారు. ఇక గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారుల తీరు కూడా సక్రమంగా ఉండటం లేదని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చేతి బోర్ల మరమ్మతులు గురైనా వారు పట్టించుకోవడం లేదన్నారు. ఈ కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉత్పన్నమవుతోందని వారు చెప్పారు. మరమ్మతులకు గురైన చేతిబోర్లను వెంటనే బాగు చేయాలని వారు డిమాండు చేశారు. ఇక గహ నిర్మాణశాఖ అధికారుల తీరుపై కూడా ప్రజా ప్రతినిధులు తీవ్ర అసంతప్తి వ్యక్తం చేశారు. సకాలంలో బిల్లులు చెల్లించక పోవడంతో జగనన్న కాలనీల్లో పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. ఈ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులు దష్టి సారించాలని వారు కోరారు. వివిధ శాఖల పనితీరుపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో వైసీపీ మండల కన్వీనరు ఉన్నం వాసుదేవనాయుడు, ఇన్ ఛార్జి ఎంపీడీవో తరుణాక్షరెడ్డి, వైస్ ఎంపీపీలు గెరటారెడ్డి, కన్నలి మల్లికమ్మ, కో-ఆప్షన్ సభ్యులు ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'తెలుగు అకాడమీ' కార్యాలయాన్ని తరలించొద్దు

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తెలుగు, సంస్కృత అకాడమీ కేంద్ర కార్యాలయంను విజయవాడకు తరలించే ప్రయత్నం మానుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి నగరంలో పలు యూనివర్సిటీలు విద్యాసంస్థలు ఉన్న దష్ట్యా తిరుపతిని ఎడ్యుకేషన్ హబ్ గా గుర్తించి రాష్ట్ర విభజన తర్వాత జీవో నెంబర్ 21 ద్వారా ఎస్ వి గోశాల, తుమ్మలగుంట రోడ్డు, తిరుపతిలో స్థాపించడంతోపాటు కార్యాలయానికి శాశ్వత భవన సముదాయం కొరకు నగరంలో రెండు నుంచి ఐదు ఎకరాల స్థలం కేటాయించాలని గతంలోనే కలెక్టర్ దష్టికి తీసుకెళ్లిన విషయం అందరికీ తెలిసినదే అయితే ప్రస్తుతం తెలుగు, సంస్కృత అకాడమీకి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజి ఇన్చార్జిగా ఉండి విజయవాడ కేంద్రంగా అదనపు బాధ్యతలుగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల సిబ్బంది మొత్తాన్ని ఆన్ డ్యూటీ పేరుతో విజయవాడకు తరలించారు. అమరావతి పై మక్కువ కలిగిన కొందరు సిబ్బంది తిరుపతిలో ప్రింటింగ్ ప్రెస్ లు లేవని, విజయవాడ రాష్ట్రానికి కేంద్ర స్థానమని, డైరెక్టర్ చైర్మన్ విజయవాడ నుండి విధులు నిర్వహిస్తున్నారనే కారణాలు చూపుతూ ఈ కార్యాలయాన్ని శాశ్వతంగా విజయవాడకు తరలించాలని చేస్తున్న ప్రయత్నాలన్నీ మానుకోకపోతే సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

రైలు ప్రమాద బాధితులకు 'ఐసిఐసిఐ' సడలింపు

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఒడిశా రైలు ప్రమాదంలో బాధిత కుటుంబాలకు సంఘీభావం తెలుపుతూ ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ తమ క్లెయిమ్ సెటిల్మెంట్ ప్రక్రియను సడలించిందని, ఈ పెను విషాదం వల్ల ప్రభావితమైన కుటుంబాలకు ఆర్థిక ఉపశమనం అందించడానికి కంపెనీ తమ క్లెయిమ్ పరిష్కారాన్ని సైతం వేగవంతం చేస్తామని ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కస్టమర్ సర్వీస్, ఆపరేషన్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అమిష్ బ్యాంకర్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధాన్ మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద కవర్ చేయబడిన వారితో సహా అందరికీ మరణం, ఆరోగ్య క్లెయిమ్‌ల ప్రాసెసింగ్ కేవలం మూడు ప్రాథమిక పత్రాల ఆధారంగా చేయబడుతుంది.

క్లెయిమ్‌లను సెటిల్ చేయడానికి అవసరమైన పత్రాలు:

- బ్యాంక్ ఖాతా వివరాలు
- మునిసిపల్ అధికారుల నుండి మరణ ధవీకరణ పత్రం. మరణ ధవీకరణ పత్రం అందుబాటులో లేకుంటే, ఆసుపత్రులు, ప్రభుత్వ అధికారులు, పోలీసులు జారీ చేసిన మరణించిన ప్రయాణీకుల జాబితా
-నామినీ యొక్క చెల్లుబాటు అయ్యే చిరునామా రుజువు కాపీ

క్లెయిమ్ సంబంధిత విచారణలకు సహాయం చేయడానికి, కంపెనీ ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్‌ను (1-860-266-7766) ఏర్పాటు చేసిందన్నారు. నామినీలు కూడా మాకు కాల్ చేయవచ్చు హెల్ప్‌లైన్ వారి సందేహాలన్నింటికి స్పష్టత ఇవ్వడానికి సిద్ధం గా వుంది" అని తెలిపారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించండి : కమిషనర్

తిరుపతి టౌన్ : నగరంలోని ప్రతి కూడలి, డివైడర్లలో చెత్త తొలగించి పూల మొక్కలు నాటి సుందరంగా తీర్చిదిద్దాలని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. బుదవారం ఉదయం నగరంలోని 3, 12, 13, 14 వార్డుల్లో గల లక్ష్మీపురం కూడలి, జయనగర్, గుర్రం జాషువా మార్గం, న్యూ ఇందిరానగర్, ఎస్.జీ.ఎస్. కాలేజ్ రోడ్డు, రాఘవేంద్ర నగర్, ఎయిర్ బైపాస్ రోడ్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు, రోడ్లను డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు ఎస్.కే.బాబు, ఆంజనేయులు, నగరపాలక సంస్థ అధికారులతో కలసి పరిశీలించారు. లక్ష్మీపురం కూడలి అపరిశుభ్రంగా ఉండడంతో వెంటనే శుభ్రం చేసి పూల మొక్కలు నాటి సుందరంగా తీర్చిదిద్దాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎస్.జీ.ఎస్. కాలేజ్ రోడ్డులో ఉన్న గుంతలు వెంటనే పూడ్చాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రజా మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ హరికష్ణ ఉన్నారు.

ఎస్‌సిలపై అక్రమకేసులు కొట్టేయాలి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఎస్‌సిలపై పెట్టిన అక్రమ కేసులను ఈ నెల 15వ తేదిలోపు కొట్టేయాలని సమతా సైనిక్ దళ్ నాయకులు డిమాండు చేశారు. స్థానిక అంబేద్కర్ భవనో బుధవారం ఆ సంఘం రాయలసీమ జోన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ 2014 నుండి ఇప్పటివరకు యస్.సి/యస్.టిల మీద గత ప్రభుత్వ హయాంలో గరగపర్రు, రావూరు, పెదగొట్టిపాడు, ఆగిరిపల్లి ఇత్యాది సందర్భాల్లో యస్.సి ల మీద పెట్టిన కేసులు కొట్టివేయాలని, "అంబేద్కర్ విదేశీ విద్య" పథకాన్ని ప్రవేశపెట్టిన కొత్త సార్వత్రిక విదేశీ విద్యా పథకంలో యస్.సిలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నందున కొత్త విధానాన్ని రద్దు చేసి పాత పథకాన్ని

కొనసాగించాలని, దళితుల భూములను అక్రమంగా కబ్జా చేస్తున్నారని వస్తున్న ఫిర్యాదులపై త్వరితగతిన విచారణ రెవెన్యూ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ నెల 15వ తేదిలోపు ఈ డిమాండ్లు పరిస్కరించకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పిల్లి సురేంద్రబాబు, ఫణీంద్ర, టి ఎస్ చిరంజీవి, సుధాకర్, రాధాకష్ణ, పున్నాక సురేష్ పాల్గొన్నారు.

రీసోర్స్ పర్సన్లకు శిక్షణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

మెప్మా కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంపొందించడానికి రిసోర్స్ పర్సన్ల కోసం బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ ప్రారంభించారు. పట్టణ పేదలతో స్వయం సహాయక సంఘాలను ఏర్పరచి సుస్థిర జీవనోపాధులను మహిళలకు కల్పించి తద్వారా సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్న మెప్మా సభ్యులందరికీ ఈ శిక్షణా శిబిరం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. శిక్షణను రీసోర్స్‌పర్సన్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెప్మా పీడీ రాధమ్మ మాట్లాడుతూ తొలిరోజు శిక్షణా శిబిరంలో 50 మంది ఆర్పీలు పాల్గొన్నారని, తిరుపతి, చిత్తూరు జిల్లాలోని ఆర్పిలకందరికి నెల రోజులపాటు రెండు రోజులకి ఒక బ్యాచ్ లో 50 మంది చొప్పున శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు విజయ్ భాస్కర్, శ్రీరాములు, సి.ఎం.ఎం కష్ణవేణి, సంఘాల అధ్యక్షురాలు ప్రతిమా రెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్1 పరీక్షలు : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఈ నెల 3 నుండి జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ -1 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నట్లు కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎస్వీయూ కాలేజీ ఆఫ్ ఆర్ట్స్ (ప్రకాశం భవన్) లో బుధవారం పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ గ్రూప్ 1 పరీక్షలు జూన్ 3వ తేదీ నుండి 10 వ తేది వరకు జరగనున్నాయని, ఆదివారం మినహా ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహణ ఉంటుందని తెలిపారు. ఈ పరీక్షలకు అభ్యర్థులు మొత్తం 577 మంది హాజరు కావాల్సి ఉంది. ఈ నెల 3న 439, 5 న 434, 6 న 434, 7న అభ్యర్థులు 429 మంది హాజరయ్యారని తెలిపారు. కలెక్టర్ పర్యటనలో ఎస్‌డిసి శ్రీనివాసులు, పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ సుమకిరణ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మణి వున్నారు.

విద్యార్థులకు ధర్మంపై అవగాహన కల్పించాలి : టిటిడి డిఇఒ

ప్రజాశక్తి - క్యాంపస్

పిల్లలకు విద్యార్థి దశ నుంచే ధర్మాచరణ, హిందూ ధర్మం గురించి అవగాహన కల్పించాలని టీటీడీ విద్యాశాఖాధికారి డాక్టర్ భాస్కర్ రెడ్డి అన్నారు. శ్వేత లో బుధవారం 6 నుండి 10వ తరగతి వరకు చదువుతున్న టీటీడీ ఉద్యోగుల పిల్లలకు సనాతన హిందూ ధర్మంపై ఒక రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డిఈవో డాక్టర్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ మనిషి ఏ విధంగా బతకాలి అని చెప్పేదే ధర్మమన్నారు. పిల్లలకు ధర్మ మార్గంలో పయనించడం, ధర్మాన్ని ఆచరించడం లాంటి విషయాలపై అవగాహన కల్పించడం మంచి కార్యక్రమమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో మంచి ఆలోచనలు కలిగించి వారు సమాజానికి ఉపయోగపడే విధంగా తయారు చేస్తాయని చెప్పారు. శ్వేత డైరెక్టర్ ప్రశాంతి పర్యవేక్షలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు శ్రీ వేంకటేశ్వర దివ్య వైభవం, సనాతన ధర్మం - పరిచయం, నైతికత - ప్రవర్తన, హిందూ ధర్మంలో మంచి అలవాట్లు- శాస్త్రీయత, వ్యక్తిత్వ వికాసం- భగవద్గీత, యోగ- ధ్యానం, అంశాలపై ఆయా రంగాల్లోని ప్రముఖులు శిక్షణ ఇచ్చారు.

కాంట్రాక్ట్ కార్మికుల రెగ్యులరైజ్ హర్షణీయం : రాజారెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వివిధ శాఖలల్లో గత ఐదు సంవత్సరాల నుండి కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న పది వేల మందిని రెగ్యులరైజ్ చేస్తూ బుధవారం జరిగిన రాష్ట్ర మంత్రి మండలిలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తీసుకొన్న సాహసోపేతమైన నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు వైఎస్ఆర్‌టీయుసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారపరెడ్డి రాజారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేసిన పాదయాత్రలో కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా వారికీ ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయడం సంతోషంచ దగ్గ విషయమని అన్నారు.

విజ్ఞానదాయకంగా ముగిసిన వేసవి శిక్షణా శిబిరం

ప్రజాశక్తి - రేణిగుంట

నెలరోజుల పాటు రేణిగుంటలో నడిచిన వేసవి శిక్షణా శిబిరం విజ్ఞానదాయకంగా, ఉత్సాహంగా సాగింది. ఎంపిడిఒ ఆఫీసులో చివరిరోజు పిల్లలు కళారూపాలను ప్రదర్శించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన 'చిలుక చదువు' కథను నాటికగా వేశారు. 'ఎందుకని ఎందుకని', విజ్ఞానబాట, పిడుగులం లాంటి పాటలతో ఓబయ్యతాత అభినయ గీతాలను చక్కగా ఆలపించారు. పాటలు, కథలు, పద్యాల పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

ఈ కార్యక్రమంలో బాలోత్సవ్ గౌరవాధ్యక్షులు టెంకాయల దామోదరం, అధ్యక్షులు నారాయణ, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి రాజు, జూలియన్ రాజ్, ఎంపిటిసి రాజేశ్వరి, ఎంపిడివో హరిప్రసాద్, లైబ్రేరియన్ శ్రీముఖి శైల్వరాజు, నర్సింహారెడ్డి తదితరులతో పాటు తల్లిదండ్రులు ప్రసంగించారు. హాజీరా, గౌతమ్, రిజ్వాన్ ప్రణతిక, జగత్ విజేతలుగా నిలిచారు.

తిరుమల కొండపై 'మరో' వివాదం

ప్రజాశక్తి - తిరుమల

ప్రభాస్, కతి సనన్ కాంబినేషన్లో తెరకెక్కిన సినిమా ఆదిపురుష్. ఓం రౌత్ డైరెక్ట్ చేసిన ఈసినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ మంగళవారం తిరుపతిలో ఘనంగా జరిగింది. అయితే మంగళవారం ఉదయాన్నే తిరుమల శ్రీవారిని ఆదిపురుష్ టీమ్ దర్శించుకుంది. ఈ టీమ్‌లో కతి సనన్ మిస్ అయ్యింది. ఇక ఈ ఈవెంట్ కంప్లీట్ అవ్వగానే మంగళవారం రాత్రి తిరుమలలో బసచేసిన హీరోయిన్ కతిసనన్ మరుసటి రోజు ఉదయాన్నే బుధవారం శ్రీవారి దర్శనం చేసుకుంది. కతీతో పాటు.. డైరెక్టర్ ఓం రౌత్ ఇతర టీమ్ కొంత మంది కూడా దర్శనంలో పాల్గొన్నారు. అయితే దర్శనం తరువాత ఆదిపురుష్ దర్శకుడు ఓం రౌత్ చేసిన పని ఇప్పుడు వివాదాస్పదమయ్యింది. ఉదయం తిరుమల శ్రీవారిని వీరు దర్శించుకున్నారు. అనంతరం గుడి వెలుపల కతి సనన్‌కు సెండాఫ్ ఇచ్చాడు ఓం రౌత్. అయితే ఈ క్రమంలో ముద్దు ఎట్టుకుని, హత్తుకున్నారు. ఆ తర్వాత కతి కారెక్కి వెళ్లిపోయారు. అలా తిరుమలలో.. శ్రీవారి ఆశీర్వాదం చేసిన శేష వస్త్రాలు అలా వంటిపై ఉండగానే ముద్దులు, హగ్గులు కనిపించడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతే కాదు ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో.. నెటిజన్లు ఓం రౌత్ పై మండిపడుతున్నారు. తిరుమలలో దేవుడి సన్నిదిలో ఈ గలీజ్ పనులేంటంటూ మండిపడుతున్నారు. అంతే కాదు ఈ వివాదం పొలిటికల్ టర్న్ తీసుకుంది. ఈ విషయంలో బీజేపీ నేతలు ఘాటుగా స్పందించారు. తిరుమల ఒక ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమని, ఇది పిక్నిక్ స్పాట్, షూటింగ్ స్పాట్ కాదని వారికి వార్నింగ్ ఇచ్చారు. స్వామివారి అర్చన సేవలో పాల్గొని ఆలయం నుంచి బయటకు వచ్చిన తర్వాత ఆలయ మహాద్వారం ముందు ఇలాంటి పని చేయడాన్ని తాము ఖండిస్తున్నామని చెప్పారు. ఇలాంటి పని చేసినందకు ఓం రౌత్ తో పాటు కతీసనన్ కూడా బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మీ కల్చర్ ఏదైనా కావచ్చు.. కాని దేవుడి సన్నిధిలో మాత్రం ఇది ఎంత మాత్రం సరికాదని అన్నారు. మరోవైపు ఈ విషయంలో ఆదిపురుష్ టీమ్ వాదన వేరే విధంగా ఉంది. కతి సనన్ కు ఫ్లైట్ టైమ్ అవుతోందని, ఆమె హడావుడిగా బయల్దేరేందుకు రెడీ అవ్వడంతో.. ఆమెకు సెండాఫ్ ఇచ్చే క్రమంలో డైరెక్టర్ ఇలా చేశారని.. కాని ఇందులో తప్పుడు ఉద్దేశ్యం కాని..అసభ్యత కానీ లేదని అంటున్నారు.

కొండపై ఆదిపురుష్ హీరోయిన్‌ను ఆలింగనం చేసుకోవడంపై విమర్శలు

ముంబాయిలో 'బాలాజీ' ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ఖర్చు మొత్తం భరించనున్న రేమండ్ గ్రూప్ సిఎండి

ప్రజాశక్తి - తిరుమల

మహారాష్ట్ర ప్రజల చిరకాల కోరికను నెరవేర్చి మనల్ని ఆశీర్వదించడానికి తిరుమల బాలాజి నవీ ముంబై లో కొలువుదీర బోతున్నారని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే సంతోషం వ్యక్తం చేశారు. నవీ ముంబైలోని ఉల్వేలో మహారాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 10 ఎకరాల స్థలంలో శ్రీవేంకటేశ్వర (బాలాజి) ఆలయ నిర్మాణానికి బుధవారం శాస్త్రోక్తంగా భూమి పూజ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండేతో పాటు, డెప్యూటీ సిఎం దేవేందర్ ఫడ్నవీస్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి షిండే ఆలయ విశేషాలను మీడియా ప్రతినిధులకు వివరించారు. "వెంకటరమణ గోవిందా" అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. నవీ ముంబైలో తిరుపతి బాలాజి మందిర నిర్మాణానికి శంఖు స్థాపన జరిగిన ఈ రోజు మహారాష్ట్రకు మరపురాని రోజు అన్నారు. తిరుమలలో బాలాజిని దర్శించుకునే అదష్టం అందరికీ ఉండదన్నారు. రాబోయే రోజుల్లో ముంబైలోనే శ్రీ బాలాజి (వేంకటేశ్వరుని) దర్శనం చేసుకునే అదష్టం మహారాష్ట్ర ప్రజలకు లభించబోతోందని చెప్పారు. ముంబై ట్రాన్స్ హార్బర్ లింక్‌లోని 22 కిలోమీటర్ల పొడవైన సింగిల్ బ్రిడ్జి



త్వరలో మహాలక్ష్మి ఆలయానికి అనుసంధానించబడుతోందన్నారు. ఈ పనులన్నీ శ్రీ బాలాజి ఆశీర్వాదంతో జరుగుతున్నాయన్నారు. నవీ ముంబైలోని శ్రీ బాలాజి ఆలయ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయడానికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని సిఎం చెప్పారు. టీటీడీ బోర్డు చైర్మన్, సభ్యులు, అధికారులు, దాతలు, మహారాష్ట్ర ప్రభుత్వ అధికారులతో పాటు ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. టీటీడీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ మహారాష్ట్ర ప్రజల చిరకాల వాంఛ అయిన బాలాజి ఆలయాన్ని తిరుమల ఆలయం తరహాలో నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సూచించారన్నారు. ఇందుకు అవసరమైన ఆలయ నిర్మాణ ప్రణాళిక సిద్ధంగా ఉందని ఆయన చెప్పారు . ఆలయ నిర్మాణం ఖర్చు మొత్తం భరించడానికి రేమండ్ గ్రూప్ సిఎండి గౌతమ్ హరి సింఘానియా ముందుకు వచ్చారని వివరించారు. రెండేళ్ళలో ఆలయ నిర్మాణం పూర్తి చేసి భక్తులకు స్వామి వారి దర్శనం కల్పిస్తామని చెప్పారు. గౌతమ్ సింఘానియా మాట్లాడుతూ ఇది తనకు చాలా సంతోషకరమైన రోజని చెప్పారు. తాను ఐదు దశాబ్దాలుగా తిరుమల బాలాజిని దర్శిస్తున్నానని చెప్పారు. ముంబైలో శ్రీ బాలాజి ఆలయాన్ని నిర్మించే అదష్టం స్వామి తనకు ఇచ్చినందుకు కతజ్ఞతలు తెలిపారు. ఈ ఆలయం మహారాష్ట్ర ప్రజలకు ఎంతో ఆధ్యాత్మిక ఆనందం పంచుతుందని ఆయన చెప్పారు. అందరి సహకారంతో ఆలయాన్ని అత్యంత వేగంగా నిర్మిస్తామన్నారు. టీటీడీ ఈవో ఎవి ధర్మా రెడ్డి, బోర్డు సభ్యులు మిలింద్ నర్వేకర్ , అమోల్ కాలే, రాజేష్ శర్మ, సౌరభ్ బోరా పాల్గొన్నారు.

గంగమ్మ సేవలో బొజ్జల బృందమ్మ

ప్రజాశక్తి-తొట్టంబేడు: తొట్టంబేడు పంచాయతీలోని పాతూరు జాతరలో భాగంగా బుధవారం గంగమ్మను బొజ్జల బృందమ్మ దర్శించుకున్నారు. జాతర నిర్వాహకులు ఆమెకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆమె అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, పాడి పంటలతో విరజిల్లాలని ఆమె గంగమ్మ తల్లిని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆమె తెలుగుదేశం పార్టీ నాయకులు బాలసుబ్రమణ్యం ఇంటిదగ్గర తేనేటి విందును స్వీకరించారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గాలి మురళి నాయుడు, బీసీ సెల్ నాయకులు భీమాల భాస్కర్, మాజీ పాల సొసైటీ ఛైర్మన్ రావిళ్ళ ముని రాజా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమంలో భోజనం పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తి జన్మదినం సందర్భంగా గూడూరు పట్టణంలోని అడవయ్యకాలనీ వద్ద ఉన్న గాడ్ గ్రేస్ సొసైటీ ఆశ్రమంలో నిరుపేదలకు, తిరుపతి జిల్లా వక్ఫ్ బోర్డ్ ఉపాధ్యక్షులు సయ్యద్ అబ్దుల్ గఫూర్ ఆధ్వర్యంలో భోజన పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అబ్దుల్ గఫూర్ మాట్లాడుతూ అందరినీ ఆప్యాయంగా పలకరించే వివాదరహితుడుగా, వైసీపీలో నిబద్ధతతో పనిచేసే మా ప్రియతమ నేత బల్లి కళ్యాణ్ చక్రవర్తికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ఆయన జన్మదినం పురస్కరించుకుని అనాధాశ్రమంలో భోజనం పంపిణీ కార్యక్రమం చేపట్టామని అన్నారు. గూడూర్ డివిజన్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ మెంబర్ కూరపాటి రవీంద్రబాబు మాట్లాడుతూ బల్లి కళ్యాణ్ చక్రవర్తికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని, రాబోయే రోజుల్లో ఆయన మరెన్నో ఉన్నతమైన పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎల్లా దీపురెడ్డి, మదర్ పాల్గొన్నారు. పట్టణంలోని గడియారం స్థంభంవద్ద ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి జన్మదినం సందర్భంగా ఆయన అభిమానులు, నాయకులు కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పేటేటి చంద్రనీల్, నాయకులు శ్రీనివాసరాజు, వంశీ పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం...

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోజా ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా గర్భిణులకు బుధవారం ఉచితంగా పౌష్టికాహారం పంపిణీ చేశారు. పౌష్టికాహారంలో వెజ్ బిర్యానీ, చెట్ని, రైతా, అప్పడాలు, బార్బీ చిక్కీలు, కోడిగుడ్డు, అరటిపండు అందించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, హాస్పిటల్ సూపరింటెండెంట్, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కంచన పుత్తూరులో 'ఫ్యామిలీ ఫిజిషియన్'

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కంచన పుత్తూరు గ్రామంలో బుధవారం ఉదయం బుచ్చినాయుడు కండ్రిగ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ పి.వి.దివాకర్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 8 మంది గర్భిణులకు, 3 బాలింతలకు బిపి, షుగర్, తదితర పరీక్షలు చేసి ఉచితంగా నెలకు సరిపడా మందులను అందించారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ పౌష్టికరమైన ఆహారం, ఆకుకూరలు, కాయగూరలు, పాలు, పెరుగు, ఐరన్ మాత్రలు రోజూ క్రమం తప్పకుండా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సుబ్రహ్మణ్యం, హేమమాలిని, మీనాక్షి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలి

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: రైతు భరోసా, పీఎం కిసాన్ 14వ విడత డబ్బులు రాని రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని వ్యవసాయ అధికారిణి భారతి తెలిపారు. బుధవారం మండలంలోని రైతు భరోసా కేంద్రంలో, అగ్రికల్చర్ కార్యాలయంలో ఈకేవైసీ చేయించుకోని రైతుల జాబితాను సిద్ధం చేసినట్లు ఆమె తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆ జాబితాలో మీ పేరు ఉంటే సమీపంలోని రైతు భరోసా కేంద్రం, కామన్ సర్వీస్ సెంటర్, వ్యవసాయ శాఖ కార్యాలయానికి వెళ్లి ఈకేవైసీ చేసుకోవాల్సిందిగా తెలిపారు. ఈకేవైసీ చేసుకుంటే డబ్బులు అకౌంట్లో జమఅవుతాయని చెప్పారు.

గంగజాతరలో నాయకులు

ప్రజాశక్తి-తొట్టంబేడు: మండల కేంద్రంలోని తొట్టంబేడు గ్రామంలోని గంగజాతరలో బుధవారం ఏపీ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ జిల్లా ప్రధాన కార్యదర్శి, శ్రీకాళహస్తి తాలూకా ఏపీ ఎన్జీవోల సంఘం అధ్యక్షుడు సి.చెంచురత్నం యాదవ్, జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతర నిర్వాహకులు వీరికి ఘనంగా స్వాగతం పలికారు. అదేవిధంగా అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. వర్షాలు బాగా కురవాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వారు కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రమేష్ యాదవ్, చందు, ధనశేఖర్, కార్తీక్ నాయుడు, రమేష్, రాజా, ప్రసాద్, మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పారదర్శక సేవలు

ప్రజాశక్తి-తిరుపతి అర్బన్: వైసీపీ ప్రభుత్వం రైతులకు పారదర్శకంగా సేవలు అందిస్తుందని చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. బుధవారం తిరుపతి రూరల్ మండలం గొల్లపల్లి రైతు భరోసా కేంద్రంలో, చంద్రగిరి మండల పరిధిలో సబ్సిడీ వేరు శెనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మోహిత్ రెడ్డి రైతులతో మాట్లాడారు. వ్యవసాయం, సాగు పరిణామాలపై ఆరా తీశారు. సబ్సిడీ వేరు శెనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఇటీవల రైతుల ఖాతాల్లో జమ చేసిన రైతు భరోసా నిధులు వచ్చాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయం సులభతరంగా సాగటానికి వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లను కూడా 40 శాతం రాయితీతో అందించినట్లు తెలియజేశారు. ప్రభుత్వం రాయితీతో వేరుశనగ విత్తనాలు, జనుము, జీలుగ విత్తనాలు కూడా అందిస్తున్నారని తెలిపారు. రైతు ఆర్థిక బలోపేతానికి సీఎం జగన్ అనేక పథకాలను అమలు చేశారని వెల్లడించారు. రైతు క్షేమంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని వివరించారు.

రైతులు కోసం నియోజకవర్గ పరిధిలో వ్యవసాయ మార్కెట్లలో భోజన సదుపాయాలను ఏర్పాటు చేయడంతో పాటు గేట్ చెల్లింపులను ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి రద్దు చేశారని గుర్తు చేశారు. ఆ మినహాయింపు నిధులు ఎమ్మెల్యే చెల్లించినట్లు తెలియజేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రతి రైతు ఈ క్రాప్ బుకింగ్ ప్రక్రియ చేసుకోవాలన్నారు. తద్వారా ప్రభుత్వం అందించే రైతు పథకాలను వినియోగించుకోవచ్చని సూచించారు. రైతుకు అందించే వేరుశెనగ విత్తనాలు 30 కిలోల బ్యాగు ధర రూ.2,790 కాగా, రూ.1,116 సబ్సిడీ తో రూ.1,674 లకే అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి మమత, వైస్ ఎంపీపీ విడుదల మాధవ రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి రూరల్ మండలంలోని పలు గ్రామాలలో గంగ జాతర సంబరాలు అంబరాన్నంటాయి. తుమ్మలగుంట శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి గంగమ్మకు సారె సమర్పించడం చెవిరెడ్డి కుటుంబ సభ్యులకు ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో బుధవారం చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అవిలాల అరుంధతీ వాడలో గంగమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముళ్ళపూడి పంచాయతీలో గంగ జాతర సందర్భంగా అమ్మవారికి సారె సమర్పించారు. ప్రజలను చల్లగా చూడాలని ఆయా గ్రామాలలో కొలువుదీరిన గంగమ్మ తల్లిని మోహిత్ రెడ్డి ప్రార్థించారు. నల్లమాని కాలువ అరుదంతివాడ, తణపల్లి హరిజన వాడ, కుంట్రపాకం, రామానుజ పల్లి హరిజనవాడ ప్రాంతాలలో అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ముళ్ళపూడి సర్పంచ్ సూరి, తనపల్లి సర్పంచ్ సుబ్రమణ్యం రెడ్డి, కుంట్రపాకం సర్పంచ్ పద్మనాభ రెడ్డి, రామానుజ పల్లి సర్పంచ్ రవి, ముస్లిం, దూదేకుల సంఘ జిల్లా అధ్యక్షులు కరమల్లా వల్లీ తదితరులు పాల్గొన్నారు.

చెత్త రహిత పట్టణంగా మార్చేందుకు కృషి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: చెత్తరహిత పట్టణంగా మార్చేందుకు కృషి చేస్తామని పుత్తూరు పురపాలక సంఘ కమిషనర్ కెఎల్ఎం రెడ్డిపేర్కొన్నారు. బుధవారం మంత్రి ఆర్కె రోజా ఆదేశాల మేరకు వివిధ అభివద్ధి పనుల ను చేపట్టడం జరిగింది. అందులో భాగంగా పుత్తూరు పురపాల సంఘ కమిషనర్ పట్టణంలో జరుగుతున్న వివిధ అభివద్ధి పనులను పరిశీలించారు. వాటిలో ముఖ్యంగా కళ్యాణపురంలో ఎప్పటినుంచో ఉన్న తాగునీటి పైపులైన్ సమస్య కు పరిష్కారం దిశగా అడుగులు వేసి దాదాపు రూ.10 లక్షల ఎస్టిమేషన్ కాస్ట్ తో పైప్‌లైన్ వర్క్ మొదలుపెట్టారు. సదరు పైప్ లైన్ పనులకు అయ్యే ఖర్చు మొత్తం రూ.10 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి కేటాయించినట్లు కమిషనర్ తెలిపారు. అనంతరం ఆయన పురపాలక సంఘం ఏఈ తో కలిసి పుత్తూరు, హరిజనవాడలో పైప్ లైన్ పనులను పరిశీలించారు. పరిసీలించడం జరిగినది. హరిజనవాడలో దాదాపు రూ.8.25 లక్షల ఎస్టిమేషన్ కాస్ట్‌తో పైపులైన్లు వేయడం జరుగుతున్నది. తదనంతరం పురపాలక సంఘం కమిషనర్ గారు గణపతి నగర్‌లో అపరిస్కతంగా ఉన్నటువంటి మురికి కాలు

వ పనులను పనులను 15వ ఆర్థిక సంఘం నిధులతో దాదాపు 5 లక్షల రూపాయలతో పనులను ప్రారంభించడం జరిగింది. అలాగే ఒంటిమిట్ట ప్రజానీకం మంత్రి రోజా దష్టికి ఒంటిమిట్ట శ్మశాన వాటిక సమస్య తీసుకెళ్లడంతో మంత్రి స్పందించి రెవెన్యూ, పురపాల సంఘం వారు కోఆర్డినేషన్‌తో శ్మశాన వాటికకు దారి ఏర్పాటు చేయుటకు సర్వే నిర్వహించి ఆ సమస్యకు పరిష్కారం చూడవలసిందిగా ఆదేశించారు. ప్రజలు మేము ఇచ్చే సలహాలు, సూచనలు పాటించి పురపాలక సంఘాన్ని చెత్త రహిత పట్టణంగా మార్చేందుకు సహకరించాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాలు జరిగితే అధికారులకు తెలియజేయాలి

ప్రజాశక్తి-గూడూరు: ఏవైనా ప్రకతి విపత్తులు, ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే అధికారులకు తెలియజేయాలని గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ బుధవారం తెలిపారు. అలా చేయడం వల్ల మీకు న్యాయం చేసేలా చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ ఉదాహరణకు మంగళవారం మండలంలోని నెలటూరు గ్రామ చెరువులో చేపలు పట్టుటకు వెళ్లిన తుపాకులు చిన్నయ్య ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయారని తిరుమల శెట్టి చందన భర్త వెంకటేశ్వర్లు గూడూరు రూరల్

పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా విషయం తెలుసుకున్న అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి స్టేట్ డిజిటల్ మేనేజ్‌మెంట్, ఆర్డీవోలకు జిల్లా కలెక్టర్ ద్వారా లేఖ పంపి 9వ బెటాలియన్ టీమును గాలింపు చర్యలకు స్టేట్ ఎస్డి ఆర్ఎఫ్ డైరెక్టర్‌కు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం గూడూరు బయలుదేరారని తెలిపారు. బుధవారం ఎట్టకేలకి గాలించి బాడీని వారికి అప్పగించారని ఆర్డీవో కిరణ్ కుమార్ తెలియజేశారు.

ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం చేసుకోవాలి

ప్రజాశక్తి-పాలసముద్రం: మండల పరిధిలోని గర్భిణీలు ప్రసవం ప్రభుత్వ ఆసుపత్రిలోని చేసుకుంటేనే మాతా శిశు మరణాలు తగ్గుతాయని వైద్య అధికారి మోహన్ కష్ణ తెలిపారు. బుధవారం పాలసముద్రం ఆరోగ్య ఉపకేంద్రంలో సూపర్వైజర్ సుశీల, మురళి సమీక్షంలో గర్భిణీలకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యపరీక్షకు వచ్చిన గర్భిణీలతో డాక్టర్ మోహన్‌కష్ణ మాట్లాడుతూ గర్భిణీలు తప్పకుండా నెలసరి వైద్యపరీక్షలు చేసుకోవాలన్నారు. ప్రసవం ప్రభుత్వ ఆసుపత్రిలోనే చేసుకుంటే ఉచితంగా

జనన సర్టిఫికెట్, మాతాశిశులను స్వేచ్ఛగా ప్రభుత్వ వాహనంలోనే స్వగ్రామానికి చేరుస్తారని తెలిపారు. ఆశా కార్యకర్తలు గర్భిణీలు ప్రసవం వరకు వారికి అందుబాటులోనే ఉండాలని సూచించారు. అనంతరం గర్భిణీలకు, చిన్నారులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పోషకాహారంతోనే అధిక పాల దిగుబడి

ప్రజాశక్తి-పాలసముద్రం: పోషక విలువ కలిగిన పదార్థాలతోనే పాడి పశువులకు అధిక పాలు దిగుబడి వస్తుందని పశు వైద్యాధికారి యసస్వి తెలిపారు. బుధవారం పాలసముద్రం రైతు భరోసా కేంద్రం ఆవరణలో పాడి పశువులకు ఉచిత వైద్యపరీక్ష నిర్వహించారు. పాడి పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలని తెలిపారు. చాలా మంది పాడి రైతులు ఏకాల వేసుకోవడం వల్ల పాల దిగుబడి తగ్గుతుందని వేసుకోవడం లేదని, టీకాలు వేయించడం వల్ల పాలు దిగుబడి తగ్గదని తెలిపారు. పాడి పశువులను రెండు రోజులకు ఒకసారి మంచి నీటితో శుభ్రంగా కడిగి ఉంచాలని తెలిపారు. పాడి పశువు ఆరోగ్యం బాగుంటే పాలలో వెన్న శాతం పెరుగుతుందని సూచించారు. అనంతరం పాడి పశువులకు టీకాలు వేశారు.

వ్యవసాయదారులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-యాదమరి: మండల పరిధిలోని జోడి చింతల సింధియా సుచి ఆధ్వర్యంలో వ్యవసాయ దారులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. మండల పరిధిలోని కొలమాసనపల్లి రత్న బయోప్లాంట్ సెంటర్‌లో బి.రత్నారెడ్డి ఎండి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్లాంట్ ఇన్స్పెక్టర్ కె.శంకర్‌రెడ్డి వ్యవసాయ దారులకు వర్మి కంపోస్ట్, రసాయనిక ఎరువులు బదులుగా సేంద్రియ ఎరువులు తయారు చేయడం, డైరీ ఫార్మ్ తేనె తయారీవిధానం, అర్బన్ మెడిసిన్ మౌలిక ఆయుర్వేద మొక్కలు హెర్బల్ క్లినిక్ తదితర కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో

సింధియా సిబ్బంది థామస్, వరదరాజులు, జాకబ్, ధనలక్ష్మి, రత్న, బయో ప్లాంట్ సిబ్బంది లత పాల్గొన్నారు.

నేడు భవన నిర్మాణాలకు భూమిపూజ

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సదుంలో రెండు కోట్ల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించ తలపెట్టిన పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణ పనులకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నేడు గురువారం ఉదయం 7:30 గంటలకు భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని జడ్పిటిసి సోమశేఖర రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, గహసారధుల మండల కన్వీనర్ ప్రకాష్ రెడ్డి తెలిపారు. అలాగే గార్గేయ నదిపై నూతనంగా కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన బ్రిడ్జి (ఫ్లైఓవర్) ప్రారంభోత్సవం, బ్రిడ్జి పైన ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల ప్రారంభోత్సవం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-సోమల: మండలానికి చెందిన ముగ్గురు వ్యక్తులకు ముఖ్య మంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సహాయ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. నంజంపేట గ్రామానికి చెందిన నగేష్‌బాబు గుండె జబ్బుతో ఇబ్బంది పడు

తుండగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దష్టికి తీసుకువెళ్లగా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి లక్ష 15 వేల రూపాయలను మంజూరు చేశారు. ఈ సందర్భంగా చెక్కును కు టుంబ సభ్యులకు సర్పంచ్ వెంకటరెడ్డి అందజేశారు. అలాగే నెల్లి మంద పంచాయతీకి చెందిన అమాస రామకష్ణయ్య యాక్సిడెంట్ అయ్యి తీవ్రగాయాలు కావడంతో చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి లక్ష 40 వేల రూపాయల ఆర్థిక సహాయ చెక్కును మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు పంపిణీ చేశారు. ప్రమాదంలో గాయపడ్డ నంజంపేట గ్రామానికి చెందిన కోటేశ్వరరావు అనే యువకుడికి వైద్య ఖర్చుల నిమిత్తం 65 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఎంపీపీ ఈశ్వరయ్య ,వైస్ ఎంపీపీ ప్రభాకర పంపిణీ చేశారు.

శ్రీసిటీ సందర్శన

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: కేంద్ర ప్రభుత్వ రబ్బర్ బోర్డు ఛైర్మన్ డాక్టర్ సవార్ ధనానియా బుధవారం శ్రీసిటీని సందర్శించారు. ఆయనకు ముందుగా శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్ కుమార్ సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ మౌళిక సదుపాయాలు, ప్రగతి, ప్రత్యేకతలను ఆయనకు వివరించారు. స్థానిక సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ రహదారిపై జ్ఞాన్ సర్కిల్ సమీపంలో ఇండియన్ రబ్బర్ మ్యానుఫ్యాక్చరర్స్ రీసెర్చ్ అసోసియేషన్ గుర్తింపు పొందిన ఓ స్వతంత్ర ప్రయోగశాలను డాక్టర్ సవర్ ధనానియా తనిఖీ చేశారు. ఈ ల్యాబ్ స్థానిక ఆటోమోటివ్, అనుబంధ పరిశ్రమలకు చెందిన రబ్బరు ఉత్పత్తుల నాణ్యత పరీక్షలు, విశ్లేషణ తదితర సేవలను అందిస్తుంది. పర్యటనలో డాక్టర్ సవర్ ధనానియా శ్రీసిటీ పరిసరాలను సందర్శించి, పారిశ్రామికవాడ మౌళిక సదుపాయాలను, పారిశ్రామిక కార్యకలాపాలను పరిశీలించారు. ఇక్కడ వసతులపై సంతప్తి వ్యక్తం చేసి, ప్రపంచ స్థాయి సదుపాయాలతో మెగా ఇండస్ట్రియల్ పార్కును అభివద్ధి చేసినందుకు శ్రీసిటీ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ఆయన అంచనా మేరకు, శ్రీసిటీలోని పరిశ్రమలు రబ్బరు బొమ్మలు, విడి భాగాలను తయారు చేసే అధిక సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. కార్యక్రమంలో డాక్టర్ రాజకుమార్, పాల్ వన్నన్ పాల్గొన్నారు.

ఎస్వీయూకు పేటెంట్

కృత్రిమ ఇసుక తయారీతో గుర్తింపు

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని డిఎస్టి పర్స్ సెంటర్‌కు పేటెంట్ లభించింది. కృత్రిమంగా ఇసుక తయారు చేసే విధానాన్ని రూపొందించినందుకు ఈ గుర్తింపు లభించింది. నిర్మాణాలకు ఉపయోగించే ఇసుకను తయారు చేయడంతో పాటు రవాణా చేయడానికి వీలుగా ఇసుకను తయారు చేయడం గమనార్హం. దీంతో పాటు తర్వాత దశలో ఈ ఇసుకతో వాటర్ ఫిల్టర్, పెయింటింగ్ వంటి వాటిని తయారు చేయాలనే లక్ష్యాలను ఏర్పరచుకున్నారు. ఈ ఆవిష్కరణలకు ప్రొఫెసర్ విజయభాస్కరరావు, డాక్టర్ సంగటి చెన్నకేశవరెడ్డి నేతత్వం వహించారు. వీరిని వీసీ ప్రొఫెసర్ కె రాజారెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మహమ్మద్ హుస్సేన్ అభినందించారు. ఇలాంటి కొత్త ఆవిష్కరణలతో యూనివర్సిటీ ఖ్యాతి పెరగడమే కాకుండా, మంచి గుర్తింపు కూడా లభిస్తుందని వారు అన్నారు. డిఎస్టి పర్స్ సెంటర్ అధికారులను, శాస్త్రవేత్తలను ఈ సందర్భంగా వారు అభినందించారు.

అమ్మవారి సేవలో నాయకులు

ప్రజాశక్తి-పలమనేరు: పట్టణంలోని నీళ్ల కుంట గ్రామంలో బుధవారం జరిగిన గంగమ్మ జాతరకు హాజరైన తెలుగుదేశం పార్టీ నాయకులకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్బిసి కుట్టి, గిరిబాబు, నాగరాజు, మదన్మోహన్, చిన్ని, సుబ్రహ్మణ్యం, సుధాకర్, కష్ణారెడ్డి, చెన్నరాయప్ప, భాస్కర్, రవి, గంగవరం నాయకులు గిరిధర్ గోపాల్, మురళి పాల్గొన్నారు.

'ఉపాధి పని దినాలు పెంచండి'

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మండలంలోని తీర్థం పంచాయతీ పరిధిలో ఉన్న వెంకటపతి చెరువు వద్ద జరుగుతున్నాయి. దాదాపు 69 మంది కూలీలు పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ తాము సంవత్సరంలో వంద రోజులు ఉపాధి హామీ పనులను చేస్తున్నామని, అయితే ఆ తర్వాత పనులు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన పనులు దొరక్క జీవనోపాధి లేక అవస్థలు పడుతున్నామని ప్రభుత్వం స్పందించి పని దినాలను పెంచాలని కోరారు. పంచాయతీ పరిధిలో వ్యవసాయ పనులు కూడా ఉండటం లేదని తమ బాధలను గుర్తించి వంద రోజుల పనులను 250 రోజులకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్ గణపతి, సర్పంచ్ జ్యోతి శ్రీనివాస్, ఎంపిటిసి రవీంద్రమ్మ తనయుడు కేశవులు పనులను పరిశీలించారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-రేణిగుంట: వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. పట్టణంలోని పాంచాలి నగర్‌కు చెందిన ఆశ(33) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతదేహం వెలికితీత

ప్రజాశక్తి-గూడూరు రూరల్: మండలంలోని నెల్లటూరు గిరిజన కాలనీ సమీపంలోని చెరువులో గుర్రపుడెక్క ఉంది. తద్వారా లోతు తెలియదు. ఈ క్రమంలో భాగంగా బుధవారం తుపాకుల చిన్నయ్య, ఆయన కుమార్తె చందన చెరువు వద్దకు వెళ్ళారు. చేపలు పట్టుకునేందుకు చిన్నయ్య చెరువులోకి దిగాడు. మద్యం సేవించి ఉండటంతో జారి పడి గల్లంతయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని వెలికి తీయలేకపోయారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్‌డిఆర్ఎఫ్ బలగాలు చెరువు వద్దకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికితీశారు. సంఘటనా స్థలంలో ఆర్డీవో కిరణ్ కుమార్, సీఐ దశరథ రామారావు, ఇతర అధికారులు దగ్గరుండి పర్యవేక్షించారు. మతుడి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం, నిత్యావసర వస్తువులు అందజేశారు. అనంతరం ఆర్డీవో కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే అధికారుల దష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు వీలుంటుందని పేర్కొన్నారు.

యువకుడు మృతి

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. బంధువుల కథనం మేరకు వివరాలు.. బెంగుళూరుకు చెందిన ఇస్మాయిల్ (25) తిరుపతిలోని తన బంధువులు ఇంటికి వచ్చాడు. బుధవారం సరదాగా బంధువులతో కలిసి తలకోనకు విచ్చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో తలకోన జలపాతానికి వెళ్లి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద ఉన్న మడుగులో పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో యువకుడిని బయటకు తీసి 108 లో చికిత్స నిమిత్తం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గూడూరు, కేవీబీపురం ప్రాంతాల్లో టాస్క్ ఫోర్స్ దాడులు నిర్వహించి ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్న 9 మందిని అరెస్టు చేసి 27 ఎర్రచందనం దుంగలు, 5 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ డీఎస్పీ మురళీధర్ తెలిపారు. బుధవారం తిరుపతి నగర పరిధిలోని టాస్క్ ఫోర్స్ ప్రధాన కార్యాలయంలో టాస్క్ ఫోర్స్ డిఎస్పీ మురళీధర్ విలేకరుల సమావేశంలో నిర్వహించి స్మగ్లర్ల అరెస్టు వివరాలను మీడియాకు వివరించారు. ఆర్ఐ చిరంజీవికి చెందిన ఆర్ఎస్ఐ నరేష్ బందం నాయుడుపేట రేంజ్ గూడూరు ఫారెస్ట్ బీట్ పరిధిలోని కొండగుట్ట నిషేధిత అటవీ ప్రాంతంలో రంగపరెడ్డిచేను వద్ద బుధవారం ఉదయం మూడు మోటారు సైకిళ్లలో కొంతమంది వ్యక్తులు కనిపించారని, వారిని చుట్టుముట్టగా పారిపోయేందుకు ప్రయత్నించారన్నారు. దీంతో వారిని పట్టుకుని విచారించగా రవాణాకు సిద్ధంగా ఉంచిన 16 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని, పట్టుబడ్డ వారు గూడూరు మండలానికి చెందిన పిగిలం నవీన్ (27), పిగిలం మనోజ్ రావు (30), పాలిచెర్ల బాలాజీ (24), నూర్ బాషా శకుర్ (27), మావాడూరి శ్రీహరి(28) వెంకటగిరి మండలానికి చెందిన పుట్టా సుబ్రమణ్యం (43) లుగా గుర్తించి అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి మూడు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మరో సంఘటనలో ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ విశ్వనాథ్ బృందం పుత్తూరు రేంజి కేవీబీపురం మండలం వగత్తూరు ఫారెస్టు బీటు పరిధిలో మారప్పగారి కండ్రిగ గ్రామంలోని అటవీ ప్రాంతంలో రెండు మోటారు సైకిళ్లపై కొందరు వ్యక్తులు టాస్క్ ఫోర్సు సిబ్బందిని చూసి పారిపోయే ప్రయత్నం చేశారని, వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా వారిలో ముగ్గురిని పట్టుకున్నామన్నారు. పిచ్చాటూరు మండలం వి.అజిత్ (26), నాగలాపురం మండలం కే. రమేష్ (44), తమిళనాడు తిరువళ్లూరు జిల్లా పొన్నేరి తాలూకాకు చెందిన ఎం.హరిదాస్ (41)గా గుర్తించామన్నారు. వీరి నుంచి 11 ఎర్రచందనం దుంగలతో పాటు రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ మురళీధర్ తెలిపారు. 27 ఎర్రచందనం దుంగల విలువ బహిరంగ మార్కెట్లో రూ. 20 లక్షలు ఉంటుందన్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌లో ఈ రెండు కేసులను నమోదు చేసి సీఐ బాలకష్ణ దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కోట: పట్టణంలోని ముస్లిం వీధికి చెందిన కీర్తి శేషులు టైలర్ కాలేషా సతీమణి మరణించింది. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. తీవ్ర అస్వస్థతకు గురై మంగళవారం సాయంత్రం ఇంటి వద్ద మృతి చెందారు. ఈ క్రమంలో పలువురు టీడీపీ నాయకులు బుధవారం ఉదయం మతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం నాయకులు కొద్దిసేపు కుటుంబసభ్యులతో మాట్లా టడి వారికి మనో ధైర్యం చెప్పారు. అనంతరం తిరుపతి పార్లమెంట్ మైనారిటీ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్ అంతిమ సంస్కార ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ తిరుపతి జిల్లా బీసీ సెల్ కార్యదర్శి తీగల సురేష్ బాబు, టీడీపీ కోట పట్టణ అధ్యక్షులు షేక్ షంషుద్దీన్, గూడూరు నియోజకవర్గం మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ నౌషాద్, కోట బిట్-1 ఎంపీటీసీ దారా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఇంటి వద్దకే వైద్యం'

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఇంటి వద్దకే వచ్చి అందించే వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని తుంబ కుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు లోహిత్ చెంగల్ రాయలు కోరారు. బుధవారం మండలంలోని కట్టప్పగారిపల్లి. ముంగరమడుగు గ్రామాల్లోని ప్రజలకు వైద్యసేవలను అందించారు. ఈసందర్భంగా గర్భిణులు, బాలింతలు, షుగర్ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు రమేష్, సిహెచ్ఓలు కుమారి, హరిప్రియ, నీరజ, దేవిశ్రీ, మంజుష, ఆరోగ్య కార్యకర్తలు సరిత, వాణి, 104 సి బ్బంది సుబ్రహ్మణ్యం, చక్రపాణి ఆశాలు పాల్గొన్నారు.